క్లుప్తంగా

కుక్కపిల్లకు పుట్టినరోజు



రూబీకి కేక్ తినిపిస్తున్న చాందినీ

వీరఘట్టం: వీరఘట్టంకు చెందిన పట్నాన చాందిని–సురేష్ దంపతులు తాము పెంచుకుంటున్న కుక్క పిల్లకు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. షిడ్ పప్పీ బ్రీడ్‌కు చెందిన కుక్క పిల్లను ఏడాది క్రితం విశాఖపట్నంలో కొనుగోలు చేశారు. దానికి రూబీ అనే పేరు పెట్టారు. దాన్ని కొనుగోలు చేసి ఏడాది పూర్తవడంతో శనివారం కేక్ కట్ చేసి రూబీకి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ప్రతి కుక్కకు ఓ రోజు వస్తుందంటే ఇదేనేమో..' 'హ్యాపీ బర్త్ డే రూబీ'..అంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రెల్ల పంచాయతీ పెద్దగూడ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శనివారం భూమిపూజ చేశారు. ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ నిధులు రూ.90 లక్షలతో రోడ్డు నిర్మిస్తున్నట్లు చెప్పారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గిరిజన గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆమె వెంట టీడీపీ నాయకులు పాడి సుదర్శనరావు, మండంగి భూషణరావు, తదితరులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

సీతంపేట: సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 10,11 తేదీల్లో కురుపాంలో నిర్వహించే ఈ మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం సీతంపేటలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.తిరుపతిరావు, ఎ.భాస్కరరావు, ఎం.కాంతారావు, పి.సాంబయ్య, వీరన్న, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేయండి



భామిని: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

భామిని: ఈ నెల 10న కురుపాంలో నిర్వహించే సీపీఎం పదో వార్షికోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని మండల కమిటీ కన్వీనర్ కొప్పర మిన్నారావు పిలుపునిచ్చారు. ఘనసరలో శనివారం మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. సీపీఎం నాయకుడు జి.జగన్నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న లారీ



కొమరాడ: మండల కేంద్రం కొమరాడ సమీపంలో ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టడంతో ట్రాఫిక్ జామ్ అయింది. పార్వతీపురం నుంచి రాయగడ వైపు వెళ్తున్న లారీ బ్రేక్‌డౌన్ కావడంతో రోడ్డుపై నిలిచిపోయింది. ఆ లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌కు చిన్న గాయాలయ్యాయి. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అంతఃరాష్ట్ర రహదారి కావడంతో ఈ మార్గంలో ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ అయింది. కొమరాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

రక్తదాన శిబిరం

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇటీవల ఈ ఆస్పత్రిలో బ్లడ్‌బ్యాంక్‌ను ప్రారంభించారు. సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావుతో పాటు పలువురు రక్తదానం చేశారు. మొత్తం 25 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. సోమవారం నుంచి ఆస్పత్రిలో రక్తం అందుబాటులో ఉంటుందని సూపరింటెండెంట్ తెలిపారు.

గడ్డిపరకే బంగారమాయే..

- యంత్రాలతో వరి కోతలు, నూర్పులు
- పనికిరాకుండ పోతున్న వరిగడ్డి
- ఎండుగడ్డికి పెరిగిన డిమాండ్
- ట్రాక్టర్ గడ్డి రూ.5వేల పైమాటే..



పాలకొండ మండలంలో యంత్రాలతో వరి కోత, నూర్పులు

పాలకొండ రూరల్:

గడ్డిపరకే అని తేలిగ్గా తీసిపారేయొద్దు. పశుగ్రాసం కొరత కారణంగా ఎండుగడ్డికి డిమాండ్ పెరగడంతో ధరలో బంగారంతో పోటీపడుతోంది. ట్రాక్టర్ ఎండుగడ్డి రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు పలుకుతోంది. ప్రస్తుతం ఖరీఫ్ వరి కోతలు దాదాపు పూర్తికావచ్చాయి. వరుస తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు యంత్రాల సాయంతో వరికోతలు, నూర్పులు పూర్తిచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీని వల్ల కూలీల కొరతను అధిగమించడంతో పాటు సమయం, ఖర్చు ఆదా అవుతోంది. యంత్రాలతో పంటకోతలు, నూర్పులు చేయడంతో వరిగడ్డి కొరత ఏర్పడింది. దీంతో పశుగ్రాసానికి డిమాండ్ భారీగా పెరిగింది. పాలకొండ నియోజకవర్గ పరిధిలో పాలకొండ, వీరఘట్టం, సీతంపేట, భామిని మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరికోతలు 92 శాతానికి పైగా యంత్రాల ద్వారానే జరిగాయి. పాలకొండ మండలంలో 6,550 ఎకరాలు, వీరఘట్టంలో 5,841, భామినిలో 4,238, సీతంపేటలో 2,125 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి.

పెరిగిన డిమాండ్

గ్రామస్థాయి నుంచి ఎండు గడ్డికి తీవ్ర కొరత ఏర్పడింది. దీంతో పాడిరైతుల నుంచి డిమాండ్ పెరిగింది. ఎండు గడ్డి ట్రాక్టర్ దాదాపు రూ.4 నుంచి రూ.5 వేలు దాటుతుండగా, రవాణా చార్జీలు మరో రూ.15 వందల వరకు అవుతోంది. అన్నీ కలుపుకుంటే ట్రాక్టర్ ఎండు గడ్డి రూ.6వేల నుంచి రూ.8 వేలకు చేరుతోంది. దీంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. పశువులకు ఈ సీజన్‌లో ఎండుగడ్డి దాణా అందించటం వల్ల పాల దిగుబడి పెరుగుతుందన్న వైద్యుల సూచనలు పాటించలేక, పశువులను పెంచలేక ఇబ్బందులు పడుతున్నారు.



పశుగ్రాసం లేక రోడ్లుపై వ్యర్థాలను ఆరగిస్తున్న పాడిపశువులు

రోజుకు సగటున 10-12 కేజీల గడ్డి అవసరం

వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన పాలకొండ నియోజకవర్గంలో పశుగ్రాసాల కొరత వేధిస్తోంది. అధిక శాతం మంది రైతులు వ్యవసాయం, పశుపోషణపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. నాలుగు మండలాల్లో సుమారు లక్షకు పైగానే పశు సంపద ఉన్నట్లు పశుసంవర్ధకశాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది. ఒక్కో పాడిపశువుకు రోజుకు సగటున 13 కేజీల ఎండుగడ్డి, 10–12 కేజీల పచ్చిగడ్డి మేతగా అందించాల్సి ఉంటుంది. ఈ లెక్కన నెలకు నాలుగు వందల కేజీలకు పైగా గడ్డి అవసరం అవుతుంది. గతంలో రైతులు సంప్రదాయ విధానంలో వరి నూర్పులు చేయడంతో ఎండుగడ్డి లభించేది. దాన్ని కుప్పగా పెట్టి ఏడాది పొడవునా పశువులకు మేతగా వినియోగించుకునేవారు. ప్రస్తుతం యంత్రాల ద్వారా వరి కోతలు, నూర్పులు చేయడం వల్ల గడ్డి చిన్నచిన్న ముక్కలుగా అవుతోంది. వాటిని పశువులు తినేందుకు ఇష్టపడటం లేదు.

ఎండుగడ్డి కొరత వేధిస్తోంది



రైతులు తుపానుల నేపథ్యంలో వరి కోతలకు యంత్రాలను వినియోగించారు. దీంతో వరి గడ్డి కొరత ఏర్పడింది. పశువుల దాణాకు ఇబ్బందులు తప్పటం లేదు. పట్టణంతో పాటు గ్రామస్థాయిలో ఇదే పరిస్థితి ఏర్పడింది. ప్రత్యామ్నాయ పద్ధతులు అవలంభిస్తున్నాం. ట్రాక్టర్ గడ్డి రూ.5వేల పైచిలుకులకు పలుకుతుంది.

– బి.సోమశేఖర్, పాడిరైతు, పాలకొండ

పశుగ్రాసం సాగుపై అవగాహన



రైతులు తమకున్న పంట భూమిలో దాణా పండించే విధానం అవగాహన కలిస్తున్నాం. అజొల్లా, హైడ్రోకొనిక్, ఏక, బహు వార్షిక పశుగ్రాసాల సేద్యంతో పాటు, పప్పు, జొన్న రకాలైన పోషక విలువలతో కూడిన దాణా సేద్యంపై పాడి రైతులు అవగాహన పెంచుకోవాలి. ఈ తరహా మేలు రకం దాణాతో పాల దిగుబడితో పాటు జీవాల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతుంది. దాణా కొరతను అధిగమించవచ్చు.

– ప్రభా మాణిక్యరావు, పశుసంవర్ధక శాఖ ఏడీ, పాలకొండ

ఉపాధిహామీ పథకంలో అక్రమాలు



సోషల్ ఆడిట్ ప్రజావేదిక నిర్వహిస్తున్న డుమా పీడీ రామచంద్రరావు

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనుల్లో పలు అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీల్లో తేటతెల్లమైంది. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధిహామీ సామాజిక తనిఖీలపై శనివారం ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో రూ.35,16,92,000తో పనులు చేపట్టారు. వాటిని 12 మంది సీఆర్‌పీలు, 2 ఎస్ఆర్‌పీల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పరిశీలించారు. పనులు జరిగాయా లేదా, వేతనదారులకు నిధులు చెల్లింపు ఎలా జరిగింది, కొలతలు ఇతర అంశాలపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ప్రజావేదిక సభలో ఆ నివేదికలను వెల్లడించారు. డుమా పీడీ రామచంద్రరావు మాట్లాడుతూ.. అక్రమాలు జరిగిన పనులకు రికవరీ చేయాలని ఆదేశించారు. పనిచేసిన చోట బోర్డులు పెట్టకుండా నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు చెల్లించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై బోర్డులు పెట్టనిదే బిల్లులు ఇవ్వవద్దని ఆదేశించారు. ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా జరిగిన పనులకు సంబంధించి గొయ్యిగూడ–జోడిమానుగూడ వరకు తారురోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు మంజూరైతే కేవలం సీసీరోడ్డు పనులు చేశారు. అలాగే కోసంగిలాడ గ్రామానికి కూడా బీటీరోడ్డు మంజూరైతే రూ.33లక్షలతో సీసీరోడ్డు వేసి చేతులు దులుపుకున్నట్లు గుర్తించారు. పైగా ఈ సమావేశానికి ఇంజినీర్లు కూడా రాకపోవడంతో ఆగ్రహించారు. సంతకాలు లేకుండా బిల్లు చెల్లింపులు చేస్తే సంబంధిత కంప్యూటర్ ఆపరేటర్‌ను తొలగించాలని ఆదేశించారు. కొన్ని గ్రామాల్లో వలంటీర్లకు అదనపు చెల్లింపులు చేశారని సోషల్ ఆడిట్‌లో డీఆర్‌పీలు చదివి వినిపించారు. ఇలాంటి చెల్లింపులు చెల్లించవద్దని రెండేళ్లుగా చెపుతున్నా పద్ధతి మారలేదని పీడీ అసహనం వ్యక్తం చేశారు. ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ, ఎంపీడీవో కె.గీతాంజలి, ఏపీడీ శ్రీహరి, ఏపీవోలు సాగర్, బాబూరావు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు

కొమరాడ: గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీపీఎం నాయకుడు కొల్లు సాంభమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు కొమరాడ గురుకుల పాఠశాల వద్ద శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గిరిజన గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు గత 18 రోజులుగా నిరసనలు తెలియజేస్తున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అధికారంలోకి వస్తే ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను అన్ని విధాలా ఆదుకుంటామని ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, హామీ అమలు దిశగా ఆలోచన చేయాలని కోరారు. లేదంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

విద్యార్థుల శ్రమదానం



శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 60 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎల్విన్‌పేట గ్రామంలో శనివారం శ్రమదానం చేశారు. పీఓ శ్రీవాణి ఆధ్వర్యంలో గ్రామంలోని వీధి కాలువలను శుభ్రం చేశారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముల్లపొదలు, తుప్పలను తొలగించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం మాట్లాడుతూ సేవభావం కలిగిన విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో ఉండడం సంతోషంగా ఉందన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది సత్య, హరి, శ్రీకాంత్, లోకేష్ ఉన్నారు.

బాలికలను రక్షించుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై అనిల్‌కుమార్

భామిని: ఆడపిల్లలను కంటికి రెప్పలా రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బత్తిలి ఎస్సై అనిల్‌కుమార్ అన్నారు. భామిని కేజీబీవీ, జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం 'బేటీ బచావో–బేటీ పడావో' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. బాలికల రక్షణకు ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయన్నారు. బాలికలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఐసీడీఎస్ పీఓ శాంతిభవానీ, సర్పంచ్ లోపింటి రాజేశ్వరి, ఎస్ఓ ప్రభావతి, మహిళా పోలీస్ చందన పట్నాయక్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణకు కృషి



సిబ్బందికి సూచనలు చేస్తున్న శ్రీనుబాబు

పాకొండ రూరల్: అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు అగ్నిమాపక సిబ్బంది శక్తివంచన లేకుండా కృషిచేయాలని జిల్లా అగ్నిమాపక అధికారి కె.శ్రీనుబాబు అన్నారు. శాఖాపరమైన వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం పాలకొండ అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి సిబ్బంది దేహదారుఢ్య, మానసిక స్థితిగతులు అంచనా వేసే క్రమంలో హోజు, లేడర్ డ్రిల్ చేయించారు. ఈ క్రమంలో పెట్రోల్ చైన్ షాలాపై సూచనలు చేశారు. రికార్డులు పరిశీలించారు. శాఖాపరంగా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. ఆయన వెంట స్థానిక ఫైర్ ఎస్సై జామి సర్వేశ్వరరావు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్టి పూజలు




సుబ్రహ్మణ్య షష్టి పూజల్లో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా మందిరంలో శనివారం సుబ్రహ్మణ్య షష్టి పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంకు చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు శ్రీనివాసరావు, ఎస్.నరసింహాచార్యులు సుబ్రహ్మణ్య షష్టి పూజలు, సుదర్శన హోమాన్ని నిర్వహించారు. వీరఘట్టం, కొత్తూరు, గరుగుబిల్లి, పార్వతీపురం, కురుపాం, తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

గంజాయి రవాణాపై నిఘా

పాలకొండ: గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని సీఐ చంద్రమౌళి తెలిపారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో శనివారం మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించారు. యువత ఎక్కువగా మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. పాలకొండ పరిసర ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలపై నిఘా ఏర్పాటు చేశామని వివరించారు. యువత పక్కదోవ పట్టకుండా ఉండేందుకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గంజాయి రవాణా, అమ్మకాలు, వినియోగంపై స్థానికులకు సమాచారం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

వేణుగోపాలస్వామికి పూజలు



బలిజిపేట: మండలంలోని చిలకలపల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు రాంబాబు భక్తుల గోత్రనామాలతో పూజలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. సుబ్రహ్మణ్య షష్టి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి

మక్కువ: విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలని గిరిజన శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిల్లల బంగారు భవిష్యత్ కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఒక అడుగు ముందుకు వేయాలని సూచించారు. పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు కాంపౌండ్ వాల్, భవన మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు కోరగా.. మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, ఎంపీడీఓ స్వరూపారాణి, తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, హెచ్ఎం హేమలత, టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాలరావు, జనసేన సాలూరు నియోజకవర్గ నాయకుడు గేదెల రిషవర్ధన్, టీడీపీ నాయకులు మావుడి ప్రసాదరావునాయుడు, పి.మల్లేశ్వరరావు, కేశవ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

- ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి



సీతంపేట: మాట్లాడుతున్న పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట: విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్–టీచర్స్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. పిల్లలను దసరా, సంక్రాంతి, వేసవి సెలవుల్లో మినహా మిగతా రోజుల్లో పాఠశాలల్లోనే ఉంచాలన్నారు. ఐటీడీఏ ద్వారా విద్యాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అలాగే సామరెల్లి ఆశ్రమపాఠశాలలో జరిగిన సమావేశంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, డిప్యూటీఈవో నారాయుడు, ఏటీడబ్ల్యూవో మంగవేణి పాల్గొన్నారు.

తల్లిదండ్రులూ బాధ్యత వహించాలి..

గుమ్మలక్ష్మీపురం: పిల్లల చదువులపై ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు పర్యవేక్షణ కూడా అవసరమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ గరల్స్ స్కూల్‌లో శనివారం జరిగిన మెగా పేరెంట్స్–టీచర్స్ మీట్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వండిపెట్టాలని, నాణ్యత విషయంలో రాజీ పడొద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, ఎంఈఓ బి.చంద్రశేఖర్, ఐసీడీఎస్ పీడీ రాణి, సర్పంచ్ బి.గౌరీశంకరరావు, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం బిడ్డిక భీముడు, ప్రిన్సిపాల్ కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

సీతంపేట: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పాలకొండ ఎమ్మెల్యే ఎన్.జయకృష్ణ అన్నారు. స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరెంట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులను తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలన్నారు. వైస్ ఎంపీపీ కె.సరస్వతి, సర్పంచ్ హెచ్.ఆదిలక్ష్మి, హెచ్ఎం ప్రసాదరావు, ఉపాధ్యాయుడు నెల్లి సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి గ్రామాభివృద్ధిపై శిక్షణ

గరుగుబిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 12 నుంచి మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి గ్రామాభివృద్ధిపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ జి.పైడితల్లి శనివారం తెలిపారు. ఈ నెల 12,13 తేదీల్లో మండల స్థాయి అధికారులకు, విలేజ్ సర్వేయర్లు, ఏఎన్ఎంలకు, జూనియర్ లైన్‌మెన్లకు శిక్షణ ఉంటుందన్నారు. అలాగే 16,17 తేదీల్లో సర్పంచ్‌లు, డిజిటల్ అసిస్టెంట్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లకు, వీఆర్‌ఓలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. 18,19 తేదీల్లో పంచాయతీ కార్యదర్శులకు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు, మహిళా పోలీసులకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఆయా తేదీల్లో సంబంధిత అధికారులు, సిబ్బంది శిక్షణకు హాజరు కావాలని కోరారు.

క్వారీ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలి

- ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి, సీపీఐ ప్రతినిధులు



చినగుడబ క్వారీని పరిశీలిస్తున్న ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి నాయకులు

గరుగుబిల్లి: గెడ్డలు, చెరువులను మాయం చేసిన క్వారీ యాజమాన్యంపై, అందుకు సహకరించిన అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మరిశర్ల మాలతి కృష్ణమూర్తినాయుడు, భారతానంద స్వామీజీ మహరాజ్ డిమాండ్ చేశారు. మండలంలోని చినగుడబ గ్రామ సమీపంలో ఉన్న క్వారీని శనివారం వారు పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడారు. 15ఏళ్ల క్రితం బతుకుతెరువు కోసం వచ్చి క్వారీ పెట్టి ఇప్పుడు తమ గ్రామాల బతుకులను బుగ్గిపాలు చేసే స్థితికి చేరుకున్నాడని క్వారీయాజమాన్యంపై రైతులు నెల్లి లక్ష్మంనాయుడు, అప్పలనాయుడు తదితరులు మండిపడ్డారు. ప్రభుత్వ భూములు, ఎర్రబంద, నెల్లివాని చెరువులను కబ్జా చేస్తూ, నెల్లివానిగెడ్డ, ఒడుగుల గెడ్డ, చింతవాని గెడ్డ, ఎన్నివాని గెడ్డలను మాయం చేసి ఒక అవినీతి సామ్రాజ్యాన్ని సృష్టించుకున్నాడని రైతులు వివరించారు. అలాగే జంఝావతి, నాగావళి కాలువలను ఆక్రమించుకొని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపించారు. అనంతరం ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధులు మాట్లాడుతూ జలవనరుల విధ్వంసం విషయంలో క్వారీ యాజమాన్యాన్ని నియంత్రించడంలో ఫారెస్టు, ఇరిగేషన్, మైనింగ్, రెవెన్యూ, పంచాయతీ శాఖాధికారులు విఫలమయ్యారన్నారు. నీటి వనరుల విధ్వంసానికి పాల్పడిన యాజమాన్యంపై దర్యాప్తును నిర్వహించి క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. క్వారీ పరిసరాలను, మాయమైన నీటి వనరులను పరిశీలిస్తే కేజీఎఫ్ సినిమా కళ్లముందు కనిపిస్తోందన్నారు. పాలకులు ద్వంద్వ వైఖరి విడనాడి ప్రజల పక్షాన నిలబడి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో వి.దాలినాయుడు, ఎస్.బలరాం, వి.శంకరరావు, సీపీఐ నాయకులు తోట జీవన్, గరుగుబిల్లి సూరయ్య, తదితరులున్నారు.